క్లుప్తంగా

భూముల రీసర్వేపై సమీక్ష


భూముల రీసర్వేపై వీఆర్వోలకు సూచనలు ఇస్తున్న తహసీల్దార్ శివకుమార్

తుని రూరల్: భూముల రీ సర్వే రికార్డుల నమోదును వేగవంతం చేయాలని తహసీల్దార్ ఎల్.శివకుమార్ వీఆర్వోలకు సూచించారు. సోమవారం తన కార్యాలయంలో గ్రామాల వారీగా వీఆర్వోలతో భూముల రీ సర్వే, రికార్డుల నమోదుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడో విడతలో తుని మండలంలో 11 గ్రామాల్లో రీ సర్వే చేయాల్సి ఉండగా పూర్తి చేశామన్నారు. రీ సర్వే రికార్డుల నమోదు పూర్తి కావలసి ఉందన్నారు. ఆరు గ్రామాలకు చెందిన రికార్డుల నమోదు పూర్తయ్యిందని, మరో ఐదు గ్రామాల రికార్డుల నమోదు పూర్తి చేయాల్సి ఉందన్నారు. దీనిపై ఆయా గ్రామాల వీఆర్వోలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మండల సర్వేయర్, విలేజ్ సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


తాళ్లూరులో రామలింగేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

గండేపల్లి: ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం తాళ్లూరులో వేంచేసిన రామలింగేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వ్యాపారులకు గొడుగుల పంపిణీ


ప్రత్తిపాడులో తోపుడు బండ్ల వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మోహన్

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో నిరుపేద తోపుడు బండ్ల వ్యాపారస్తులకు సోమవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గొడుగులు పంపిణీ చేశారు. వీటిని కాకినాడ జేఎన్‌టీయూకే పూర్వ విద్యార్థి కొత్తమాసు రామారావు సమకూర్చారు. గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో తోపుడు బండ్లపై పండ్లు, కూరగాయలు తదితర వాటిని విక్రయించే నిరుపేద వ్యాపారులకు ఎండ, వానల నుంచి రక్షణ కోసం గొడుగులను లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బి.మోహన్ అందజేశారు. కార్యక్రమంలో మినర్వా స్కూల్ అధినేత డీవీఎస్ రమేష్‌రాజు, తాతా సాంబు, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యుడు ఏడిద రెడ్డి నాయుడు, కె.సంజీవరావు, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

హరిదాసుకు సన్మానం


ధర్మవరంలో హరిదాసును సన్మానిస్తున్న గ్రామస్తులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం జువ్వల వారి రామాలయం వద్ద సోమవారం హరిదాసును గ్రామస్తులు సన్మానించారు. వీర వేంకటవిజయ దుర్గ నాట్య మండలి అధ్యక్షుడు సానా నూకరాజు నాయుడు ఆధ్వర్యంలో హరిదాసు కృష్ణదాసును ఘనంగా సన్మానించి జ్ఞాపిక, నగదును బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో సిద్ద పెద్దకాపు, జాగు సూర్యనారాయణ, వార్డు మెంబర్ కోన సత్తిబాబు, జువ్వల నాగు, తూపాటి బాలయ్య, సత్తిరాజు పాల్గొన్నారు.

గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్రలు


చింతలూరులో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని చింతలూరు, గజ్జనపూడి గ్రామాల్లో సోమవారం వికసిత్ భారత్ సంకల్పయాత్రలు నిర్వహించారు. ఎంపీడీవో ఎంపీవీఆర్ కుమార్ బాబు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కంద వీరస్వామి, మదినే బాబ్జి, ఎంఈఓ-2 అచ్చిరాజు, సర్పంచులు పండ్రాడ గంగరాము, జి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.


ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో సందడి చేస్తున్న హరిదాసు


కిర్లంపూడిలో ముద్రగడకు శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు


వీరవరంలో తోట నరసింహానికి శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు


కోటనందూరులో ఎంపీపీ శ్రీనివాసుకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వైభవంగా న్యూ ఇయర్ వేడుకలు

- ఆటపాటలతో సందడి చేసిన యువత
- గ్రామాల్లో పండగ వాతావరణం
- నేతల ఇంటి వద్ద కోలాహలం

ఏలేశ్వరం: తమ జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుకుంటూ నూతన సంవత్సరానికి ప్రజలు స్వాగతం పలికారు. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో సోమవారం న్యూ ఇయర్ వేడుకలు వైభవంగా జరిగాయి. ప్రజలు ఉదయం నుంచి ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. యువత స్వీట్లు, పండ్లు, బొకెలు ఇచ్చుకుంటూ ఉత్సాహంగా గడిపారు. విద్యార్థులు గ్రీటింగ్స్ కార్డ్స్ పంపిణీ చేశారు. దీంతో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌కు శుభాకాంక్షలు చేప్పేందుకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి వేలాదిగా ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీశ్రేణులు శంఖవరం తరలి వెళ్లారు. లింగంపర్తిలో మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఏలేశ్వరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, వైస్‌చైర్‌పర్సన్ శిడగం త్రివేణి, మున్సిపల్ కౌన్సిలర్లు బదిరెడ్డి గోవిందు, మూదినారాయణస్వామి, బొదిరెడ్డిగోపి, జువ్విన వీర్రాజు ఇంటి వద్ద వేడుకలు నిర్వహించారు. పెద్దనాపల్లిలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, యర్రవరంలో జెడ్పీటీసీ నీరుకొండ రామకుమారి ఇళ్ల వద్దకు స్థానిక నేతలు క్యూ కట్టారు.

కోటనందూరు: మండల వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, కో ఆపరేటివ్ సొసైటీలో సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఎంపీపీకి ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కొంగొత్త ఆశలతో స్వాగతం

ప్రత్తిపాడు రూరల్: కొంగొత్త ఆశలతో...నూతన ఆలోచనలతో... సరికొత్త విధానాలతో నూతన సంవత్సరానికి ప్రజలు స్వాగతం పలికారు. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. చిన్నారులు గ్రీటింగ్స్, ప్రముఖులు బొకేలు, యువత సోషల్ మీడియా ద్వారా నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఇంటి ముందు రంగు రంగుల ముగ్గులు వేసి మహిళలు నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు.


శంఖవరంలో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు, అభిమానులు

సోషల్ మీడియాదే అగ్రస్థానం

గతంలో నూతన సంవత్సర వేడుకలను గ్రీటింగ్స్ ద్వారా నేరుగా ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపే సాంప్రదాయానికి యువత స్వస్తి పలికారు. ప్రస్తుతం ఆధునిక ప్రపంచం అరచేతిలోకి వచ్చి చేరడంతో ఒక్కరోజు ముందు నుంచే అడ్వాన్స్ నూతన సంవత్సర శుభాకాంక్షలు అంటూ వాట్సాఫ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగాం, ట్విట్టర్ వంటి సోషల్ మీడియాలో యువత శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అర్ధరాత్రి 12 గంటల నుంచి యువత సోషల్ మీడియాలో బిజీగా గడిపేశారు.

ప్రత్తిపాడు: మండల వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ప్రత్తిపాడులో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి ఇళ్ల వద్దకు భారీగా అభిమానులు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు పత్రి రమణ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. గ్రామాల్లోని వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు ర్యాలీలు నిర్వహించారు. ధర్మవరం, కత్తిపూడి మీదుగా శంఖవరం చేరుకుని ఎమ్మెల్యే పర్వత పూర్ణ చంద్ర ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే స్వగ్రామంలో సందడి

శంఖవరం: ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ స్వగ్రామం శంఖవరంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు వైభవంగా జరిగాయి. ఏలేశ్వరం, పత్తిపాడు, రౌతులపూడి, శంఖవరం నాలుగు మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు భారీగా తరలివచ్చి పుష్పగుచ్ఛాలతో ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులు విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర సామగ్రిని తీసుకొచ్చారు. వేలాది మంది అభిమానులు తరలిరావడంతో రోడ్లన్నీ రద్దీగా మారాయి. తన కోసం వచ్చిన అభిమానులు, నాయకులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఎమ్మెల్యే భారీ ఏర్పాట్లు చేశారు. అభిమానులకు భోజన సౌకర్యం కల్పించారు. ప్రతిఒక్కరినీ ఎమ్మెల్యే పలకరించి అభిమానులు ఆనందాన్ని రెట్టింపు చేశారు. పలు గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బైక్ ర్యాలీలు, కార్ల ర్యాలీలు చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అలమండ చలమయ్య, శిగడం వెంకటేశ్వరరావు, శెట్టిబత్తుల కుమార్‌రాజా, ఈగల అప్పారావు, గొల్లు చిన్నదివాణం, కూనిశెట్టి మాణిక్యం, గొంతిన సురేష్, బెహరా దొరబాబు, వాసిరెడ్డి భాస్కరబాబు, గోళ్ల కాంతి సుధాకర్ పాల్గొన్నారు.

గండేపల్లి: మండలంలో న్యూ ఇయర్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, మురారి ఉప సర్పంచ్ జాస్తి వసంత్, తాళ్లూరులో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఒబిణ్ణి వీరబాబు తదితర నేతల ఇంటికి అభిమానులు భారీగా తరలివెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

జగ్గంపేటలో..

జగ్గంపేటలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబును నియోజకవర్గంలోని నాయకులు, అభిమానులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, జెడ్పీటీసీ ఒమ్మి బిందుమాధవి ఇళ్ల వద్ద న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు వారిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గోకవరం: నియోజకవర్గవ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. అర్ధరాత్రి 12 గంటలకు చిన్నా, పెద్దా సందడి చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. మహిళలు రంగవల్లులతో కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గోకవరం ఎస్సై యువి శివనాగబాబు ఆధ్వర్యంలో సిబ్బంది గస్తీ నిర్వహించారు. చిన్న పిల్లలు గ్రీటింగ్స్‌తో శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మండలంలోని ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద సందడి వాతావరణం నెలకొంది.

కిర్లంపూడి: మండలంలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. కిర్లంపూడిలోని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఇంటికి అభిమానులు పోటెత్తారు.

ప్రత్తిపాడు, జగ్గంపేట, పిఠాపురం నియోజకవర్గాల నుంచి అభిమానులు భారీగా తరలివచ్చి ముద్రగడకు, ఆయన తనయుడు గిరిబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. వీరవరంలోని మాజీ మంత్రి తోట నరసింహం నివాసంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. జగ్గంపేట నియోజకవర్గం నుంచి భారీగా అభిమానులు తరలి వచ్చి తోట నరసింహం, ఆయన తనయుడు తోట రాంజీకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

రౌతులపూడి: మండల వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. గ్రామాల్లోని వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు ర్యాలీగా శంఖవరం వెళ్లి ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఎస్.పైడిపాలలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం స్వగృహం వద్ద న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. అధికారులు, స్థానిక నేతలు జెడ్పీటీసీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి రాజాకు శుభాకాంక్షల వెల్లువ


మంత్రి రాజాను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

తుని: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తునిలో రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా క్యాంపు కార్యాలయానికి అభిమానులు పోటెత్తారు. పార్టీలతో సంబంధం లేకుండా పెద్ద సంఖ్యలో నాయకులు, ప్రజాప్రతినిధులు తరలివచ్చి మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. తుని, తొండంగి, కోటనందూరు మండలాలతో పాటు తుని పట్టణానికి చెందిన ప్రజలు భారీగా తరలివచ్చారు. ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో అభిమానులు, నాయకులు, కార్యకర్తల నడుమ మంత్రి రాజా కేక్ కట్ చేశారు. ఎంతో శ్రమ పడి వచ్చిన ప్రతి వ్యక్తిని మంత్రి ఆప్యాయంగా పలకరించారు. మంత్రి రాజాతో నాయకులు, అభిమానులు సెల్ఫీలు దిగారు. కొత్త సూరవరం, మర్లపాడుకు చెందిన నాయకులు గజమాలలతో సత్కరించారు. అన్నవరం సత్యనారాయణస్వామి, లోవ దేవస్థానంలో వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. తన రాజకీయ భవిష్యత్‌కు వెన్నుదన్నుగా నిలిచిన నాయకులు, కార్యకర్తలకు రుణపడి ఉంటానని రాజా అన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పూలబొకెలకు బదులుగా పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు గిఫ్టుగా తీసుకువచ్చారు. తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, లోవ దేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బరాయులు, ఎంపీపీలు డాక్టర్ బొప్పన రాము, లగుడు శ్రీను, జెడ్పీటీసీ సభ్యురాలు పోతల సూర్యామణి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నార్ల రత్నాజీ, డీసీసీబీ డైరెక్టర్ పోలిశెట్టి సోమరాజు, మూడు మండలాల పార్టీ అధ్యక్షులు, యువజన విభాగం అధ్యక్షులు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, అభిమానులు పాల్గొన్నారు.


తునిలో మంత్రి రాజాకు శుభాకాంక్షలు తెలుపుతున్న చైర్‌పర్సన్ సుధారాణి


లింగంపర్తిలో న్యూ ఇయర్ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు


పెద్దనాపల్లిలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జిని గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

అయోధ్య రాముని అక్షతల పంపిణీ


రంపయర్రంపాలెంలో అయోధ్యరాముని అక్షతలు పంపిణీ చేస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు


మురారిలో ప్రజలకు అక్షతలు పంపిణీ చేస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

గోకవరం: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం గడపగడపకూ అయోధ్యరాముని అక్షింతల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రంపయర్రంపాలెంలో విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు కొరవలి సత్యన్నారాయణ, సూరపురెడ్డి వెంకటరమణ, ఉంగరాల ఆదివిష్ణు, శీలలం బుజ్జి అక్షతల పంపిణీని ప్రారంభించారు. శ్రీరామ జన్మభూమి అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను గ్రామంలో ప్రతీ ఇంటికి పంపిణీ చేశారు. జనవరి 22న అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవం రోజున అక్షింతలను శిరస్సుపై వేసుకోవాలని సూచించారు. వెదురుపాకలోనూ ప్రజలకు అయోధ్య రాముని అక్షతలు పంపిణీ చేశారు. హిందూ పరిషత్ సభ్యులు జైశ్రీరాం నినాదాలు చేస్తూ ఇంటింటికీ వెళ్లి అక్షతలు అందజేశారు. కార్యక్రమంలో సనాతన ధర్మప్రబోధనా సమితి అధ్యక్షుడు తోట సాయిబాబు, కొరిపల్లి అప్పలస్వామి పాల్గొన్నారు.

గండేపల్లి: అయోధ్య రామ మందిరంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా పూజ చేసి తీసుకువచ్చిన అక్షతలను సోమవారం ప్రజలకు పంపిణీ చేశారు. మండలంలోని మురారిలో విశ్వహిందు పరిషత్ మండల అధ్యక్షుడు మావిరెడ్డి వీరభద్రరావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి అక్షతలు అందజేశారు. గ్రామంలో రామ నామ సంకీర్తన నిర్వహించారు. తొలుత అక్షతలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వహిందు పరిషత్ మండల కార్యదర్శి పిరాట్ల రాంబాబు, భజరంగబలి సంఘ మండల అధ్యక్షుడు మండ బ్రహ్మాజీ, భజన సంఘం గురువు సేవా తాతారావు, శ్రీరామ సేవకులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో పాటు నూతన సంవత్సరం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. తెల్లవారు జామున స్వామి వారికి జరిగే తొలి అభిషేకం, పూజలను తిలకించడానికి బారులు తీరారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు తెల్లవారు జామున పిఠాపురం మహారాజా గోత్రనామాలతో పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లకు ఆలయంలోని ఉప ఆలయాలు, మూలవిరాట్‌లకు ప్రత్యేక పూజలు జరిగాయి. పూజల అనంతరం సాయంత్రం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దేవస్థానంలోని అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో భోజన ఏర్పాట్లు చేశారు.


సామర్లకోట పంచారామ క్షేత్రంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

మద్యం మత్తులో ప్రమాదానికి గురైన యువకుడు

పిఠాపురం: మద్యం మత్తులో వాహనాన్ని నడుపుతూ అదుపుతప్పి పడిపోవడంతో ఒక యువకుడికి గాయాలయ్యాయని గొల్లప్రోలు హైవే పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం కత్తిపూడి నుంచి మోటారు సైకిల్‌పై పిఠాపురం వైపు వస్తున్న ఒక యువకుడు మద్యం మత్తులో గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద అదుపుతప్పి కింద పడిపోయాడు. దీంతో గాయాలపాలైన అతడిని హైవే అంబులెన్సులో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. యువకుడు ఎవరనేది వివరాలు తెలియాల్సి ఉంది. గొల్లప్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

తుని రూరల్: ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఎస్.అన్నవరంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి, ఎన్.సూరవరంలో వేంకటేశ్వరస్వామి దేవస్థానాలు భక్తులతో కిటకిటలాడాయి. తేటగుంట, హంసవరం, టి.తిమ్మాపురం గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్.అన్నవరంలో వేంకటేశ్వరస్వామికి పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో పులంగి సేవ, శ్రీపుష్ప యాగం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి, పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, తుని చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు కంకిపాటి జమీలు, ప్రముఖ వ్యాపార వేత్త దాటిశెట్టి విష్ణుచక్రం, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయాలకు భక్తుల తాకిడి

తొండంగి: ఆంగ్ల నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా సోమవారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తొండంగి, శృంగవృక్షం, గోపాలపట్నం, ఒంటిమామిడి, శివాలయాల్లో ప్రత్యేక పూజ లు చేశారు. దానవాయిపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, మేరుగు ఆనందహరి దంపతులు ప్రత్యేక పూజ లు నిర్వహించారు. తొండంగి రామలింగేశ్వరస్వా మి ఆలయంలో వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు.

గోకవరం: కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని తంటికొండ వేంకటేశ్వరస్వామి, గోకవరంలో దేవీచౌక్ ఆలయం, రమాసత్యనారాయణ స్వామి ఆలయం, గుమ్మళ్లదొడ్డిలోని రమాసత్యనారాయణ స్వామి ఆలయాలు వేలాదిగా భక్తులు బారులు తీరారు.


ఎస్.అన్నవరంలో వేంకటేశ్వరస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

సత్యదేవుని దర్శించిన ప్రవచన కర్త 'చాగంటి'

అన్నవరం: ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు సోమవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని ఆలయ ఏఈవో కృష్ణారావు, అన్నదానం సూపరింటెండెంట్ బి.సత్యశ్రీనివాస్ అందజేశారు.


ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావుకు సత్యదేవుని చిత్రపటం అందజేస్తున్న ఏఈవో కృష్ణారావు

బీసీవై పార్టీ కార్యాలయం ప్రారంభం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెంలో భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ క్యాంపు కార్యాలయాన్ని సోమవారం ఆ పార్టీ రాష్ట్ర సమన్వయ సారధి డాక్టర్ అనూష ప్రారంభించారు. కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. అనూషకు పార్టీ నాయకులు, కార్యకర్తలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీటీవో శ్రీరామచంద్రమూర్తి, పిఠాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ కరణం చిన్నారావు, సీమాంధ్ర సంఘం నేతలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

పెద్దాపురం: ఆటో బోల్తా పడిన సంఘటనలో ఓ యువకుడు తీవ్ర గాయాలపాలైన సంఘటన సోమవారం స్థానిక వడ్లమూరు రోడ్డులో చోటుచేసుకుంది.

స్థానికుల కథనం ప్రకారం.. గోరింట గ్రామానికి చెందిన బొంతు చిన్న ఆటోపై వస్తుండగా అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చిన్నకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐ సురేష్‌ను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

కేఓ మల్లవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

తుని రూరల్: మండల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం నుంచి రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పి.రవికుమార్ సోమవారం తెలిపారు. రెండో విడతలో ప్రతి మంగళవారం ఒక సచివాలయం పరిధిలో ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేస్తారన్నారు. దీనిలో భాగంగా తొలివారం ఈ నెల 2న కేఓ మల్లవరంలో శిబిరం నిర్వహిస్తారని తెలిపారు. ఎస్.సూరవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రోగులకు పరీక్షలు చేస్తారని తెలిపారు. గ్రామస్తులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలి

ప్రత్తిపాడు: ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ఆంధ్ర ప్రదేశ్ ల్యాండ్ టైటిలింగ్ 2022 యాక్ట్ 27/23ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్), ప్రజా సంఘాల ప్రతినిధులు నిరసన చేపట్టారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఐలాజ్ రాష్ట్ర అడ్‌హక్ కమిటీ కన్వీనర్ బుగత శివ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా బుగత శివ మాట్లాడుతూ ఈ చట్టం వల్ల సామాన్య ప్రజలు న్యాయానికి దూరం అవుతారన్నారు. ఈ చట్టం రద్దు కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు ఉద్యమిస్తున్నారన్నారు. ఐలాజ్ కమిటీ సభ్యురాలు అవసరాల దేవి, ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు తదితరులు పాల్గొన్నారు.

పాళమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణం పూర్తి

కరప: పెనుగుదురు గ్రామ దేవత పాళమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ నెల 4న ఉదయం 8.13 గంటలకు రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, శ్రీవిద్య దంపతుల చేతుల మీదుగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిపేందుకు సర్పంచ్ రెడ్డిపల్లి వెంకటమాధవి, ఎంపీటీసీ సభ్యురాలు బండారు సుజాత ఆధ్వర్యంలో గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామస్తులు తమ ఇలవేల్పుగా కొలిచే పాళమ్మ తల్లి ఆలయం శిథిలావస్థకు చేరడంతో ప్రజల వినతి మేరకు ఎమ్మెల్యే కన్నబాబు స్పందించి ఆలయ పునర్నిర్మాణానికి రూ.35 లక్షలు మంజూరు చేయించారు. పది నెలల కిందట భూమిపూజ చేశారు. ఈ పనులు పూర్తి కావడంతో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు చేశారు.